సాక్షి ఖమ్మం

శనివారం । 19 । అక్టోబర్ । 2024



అందని పౌష్టికాహారం

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదని, డైట్ చార్జీలు పెంచలేదనే విమర్శలొస్తున్నాయి. 8లో



పచ్చ దోమపై దృష్టిపెట్టాలి

పత్తి పంటలో పచ్చ దోమ ఉధృతి నివారణకు సస్యరక్షణ చర్యలపై రైతులు దృష్టి సారించాలని కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 23°

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది. రాత్రివేళ అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘చెకుముకి’ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు

ఖమ్మం సహకారనగర్ : విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జేవీవీ గత 36 సంవత్సరాలుగా సమాజంలో మార్పు కోసం పనిచేస్తుండటం అభినందనీయమన్నారు. పిల్లల్లో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంచే టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థులంతా హాజరయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక బాధ్యులు నాగేశ్వరరావు, మోహన్, రామారావు, శివ నారాయణ, రాఘవయ్య, ఎల్.వి.రెడ్డి, డాన్ బాస్కో, లింగమూర్తి పాల్గొన్నారు.

రేపు నెల నెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నెలనెలా వెన్నెల అభ్యుదయ సాంస్కృతిక కదంబాన్ని నిర్వహిస్తున్నట్లు అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్) అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్ రావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగుల రామారావు, కొమ్ము ప్రసాద్ రచించగా, కె. దేవేంద్ర దర్శకత్వం వహించిన ‘హాలికులు సేమమా?’ నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఖమ్మం కళా పరిషత్, ప్రజానాట్య మండలి సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో కళాభిమానులు, కళాకారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లాకు 1.75 కోట్ల చేప పిల్లలు



చేప పిల్లలు వదులుతున్న శివప్రసాద్

నేలకొండపల్లి : జిల్లాలోని 876 చెరువుల్లో 1.75 కోట్ల చేప పిల్లలు వదిలేలా కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి జి.శివప్రసాద్ తెలిపారు. మండలంలోని చెరువుమాధారం చెరువులో శుక్రవారం చేప పిల్లలు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మత్స్య కార్మికులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు అందిస్తోందని చెప్పారు. జిల్లాలోని అన్ని చెరువులకు దాదాపు రూ.2.10 కోట్ల విలువైన చేప పిల్లలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 50 చెరువుల్లో పిల్లలు వదిలామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అడ్‌హక్ కమిటీ చైర్మన్ మామిడి వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు ఖాసీం, ఉపాధ్యక్షుడు దీరావత్ రాధాకృష్ణమూర్తి, డైరెక్టర్లు బలరాం, శేషయ్య, వెంకటరాములు, వెంకమ్మ పాల్గొన్నారు.

అండర్ - 17 టీటీ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా టీటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన జిల్లా స్థాయి పాఠశాలల అండర్ –17 టేబుల్ టెన్నిస్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల క్రీడా కార్యదర్శులు కె.నర్సింహమూర్తి, వి.నరేష్ వివరాలు వెల్లడించారు. జిల్లా బాలికల జట్టులో పి.వంశిక, బి.సాయిశివాని, జి.చంద్రికారాణి, ఎ.ప్రవళ్విక, జి.సిరి, కె.నవ్య, ఎం.ధరణి, బి.అఖిల, కె.స్పందన, బాలుర జట్టులో జశ్విక్, ఎస్.ఫయాజ్, ఆర్.రాంసాకేత్, కె.హితేష్ శ్రీ రంగా, స్టాండ్‌బైలుగా సీహెచ్.కేతన్ అమర్, పి.మహేష్ కృష్ణ ఉన్నారని వివరించారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి వి.సాంబమూర్తి పర్యవేక్షణలో ఎంపికలు నిర్వహించారు.

రేపు అండర్ –14 ఖోఖో ఎంపికలు

జిల్లాస్థాయి అండర్–14 పాఠశాలల ఖో–ఖో బాలబాలికల జట్లను ఆదివారం ఎంపిక చేస్తున్నట్లు నర్సింహమూర్తి, వి.నరేష్ తెలిపారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపికలు జరుగుతాయని, హాజరయ్యే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలు తేవాలని సూచించారు.

గ్రహణం వీడేనా ?



హరిత హోటల్ నిర్మించనున్న ప్రదేశం

సాక్షి ఫోకస్

☞ నూతన బస్టాండ్ సమీపంలో రూ.10 కోట్ల వ్యయంతో హరిత హోటల్ నిర్మాణానికి గత ప్రభుత్వం 2021 జనవరి 12న శంకుస్థాపన చేయించింది. నాలుగేళ్లు కావొస్తున్నా ఈ పనులు పునాదుల దశలోనే ఉన్నాయి. భద్రాచలం, పాల్వంచ, బొగత జలపాతానికి వెళ్లే టూరిస్టులు ఇక్కడ బస చేసి.. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని లకారం ట్యాంక్‌బండ్‌ని వీక్షించే ఉద్దేశంతో దీని నిర్మాణానికి పూనుకున్నారు. కానీ పునాదే పడకపోవడంతో ఈ హోటల్ నిర్మాణం ఎప్పుడు పూర్తి కావాలి..? పర్యాటకులకు ఎప్పుడు అందుబాటులోకి రావాలి అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది.

గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనలు

- ఈ సర్కారులో ముందుకు కదలని పనులు
- పునాది పడని హరిత హోటల్, ఆర్టీసీ కన్వెన్షన్ సెంటర్
- పిల్లర్లకే పరిమితమైన లకారం సమీపంలోని షాదీఖానా
- రీడిజైనింగ్ దశలో ఉన్న మున్నేరు రిటైనింగ్ వాల్

ప్రజల సౌకర్యం, సంక్షేమానికి ప్రభుత్వ పరంగా చేపట్టిన నిర్మాణాలకు గ్రహణం పట్టుకుంది. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో పలు పనుల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఆ పనులు ముందుకు సాగడం లేదు. కొన్ని నిర్మాణాలకు పునాదులు పడితే.. మరికొన్నింటికి పునాది రాయి కూడా పడక శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి. దీంతో ప్రారంభమైన నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడు, అసలు మొదలు కాని పనులు చేపడతారా..? అనే సందేహాలు నెలకొన్నాయి. కొన్ని నిర్మాణాలకు రాజకీయ గ్రహణం పట్టుకుందన్న చర్చ సాగుతోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



షాదీఖానా నిర్మాణానికి వేసిన శిలాఫలకం, పక్కన పిల్లర్లకే పరిమితమైన పనులు

☞ లకారం సమీపంలో నూతన షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడాది దాటింది. 2023 జూన్ 10న కార్పొరేషన్ ఎల్‌ఆర్‌ఎస్ నిధులు రూ.2.కోట్ల అంచనా వ్యయంతో ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గతంలో పునాది లెవల్‌లో పిల్లర్లు తీసి వదిలేశారు. ఇప్పటి వరకు ఈ పనులు ముందుకు సాగడం లేదు. లకారం చెరువు నీరు ఈ పిల్లర్లకు చేరడంతో ప్రస్తుతం చెరువును తలపిస్తోంది. పిల్లర్లకే పరిమితమైన ఈ భవన నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి.



ఆర్టీసీ ఏసీ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి వేసిన శిలాఫలకం

☞ ఆర్టీసీ ఉద్యోగులు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు కొత్త బస్టాండ్ సమీపంలో గతేడాది సెప్టెంబర్‌లో ఏసీ కన్వెన్షన్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. 1.7 ఎకరాల్లో రూ.40 కోట్ల అంచనా వ్యయంతో ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి డిజైన్ చేశారు. ఏడాది గడిచినా ఇక్కడ పునాది రాయి పడలేదు. బస్టాండ్‌లో చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలకు డంపింగ్‌గా ఈ స్థలం మారింది. దీంతో కన్వెన్షన్ సెంటర్ నిర్మించే పరిస్థితి కనిపించడం లేదు.



పాత డిజైన్ ప్రకారం చేపట్టిన కరకట్ట నిర్మాణ పనులు (ఫైల్)

☞ మున్నేరు వరద ముప్పు తప్పేలా గత ప్రభుత్వం ఏటికి రెండు వైపులా కలిపి 17 కిలో మీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.690 కోట్లు మంజూరు చేసింది. గతంలో 30 అడుగుల వరకు మున్నేరు వరద వచ్చింది. దీనికి అనుగుణంగా అప్పట్లో రిటైనింగ్ వాల్ డిజైన్ చేశారు. ఈ మేరకు 2023 సెప్టెంబర్ 30న శంకుస్థాపన చేశారు. అయితే గత నెల 1న మున్నేటికి 40 అడుగుల వరకు వరద వచ్చింది. దీంతో గతంలో చేసిన డిజైన్‌ను రీడిజైన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జల వనరుల శాఖ అధికారులు కొత్తగా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. కొత్త డిజైన్ వస్తేనే ఈ నిర్మాణ పనులు షురూ కానున్నాయి.

☞ లకారం చెరువు వద్ద రూ.10 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు, మిగతా ప్రాంతాల్లో అమృత్ 2.0 కింద రూ.248.50 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు 2023 సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేశారు. ఈ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఉన్న డ్రెయినేజీలు పూడిపోవడం, కొత్తగా నిర్మాణం చేపట్టకపోవడంతో ఇటీవల వచ్చిన వరదలకు నగరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. అలాగే గోళ్లపాడు చానల్ పనులు కూడా పలు చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి.

☞ యువతకు ఉపాధి కల్పించేందుకు జిల్లా కేంద్రంలో మొదటి దశలో ఐటీ హబ్ నిర్మించారు. రెండో ఐటీ హబ్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.36 కోట్లు మంజూరు చేసింది. అయితే మూడేళ్లు గడిచినా ఈ పనులు పూర్తి కాలేదు. ఇప్పటివరకు యువతకు ఉద్యోగాల కల్పన మిథ్య అయింది. ఆర్భాటంగా శంకుస్థాపన చేసినా నిర్మాణం మాత్రం ఇదే స్థాయిలో జరగకపోవడం గమనార్హం.



ఐటీ హబ్-2 పనులు చేస్తున్న దృశ్యం

నాగన్నకు నేడు ‘సుద్దాల’ పురస్కారం



సుద్దాల అశోక్ తేజతో నాగన్న కుటుంబం

ఖమ్మంమయూరిసెంటర్ : గత ఐదు దశాబ్దాలుగా ప్రజల పాటలే జీవితంగా పాడుతున్న ప్రజా గాయకుడు, సాంస్కృతిక విప్లవోద్యమంలో అరుణోదయమే తన ఇంటి పేరుగా గుర్తింపు పొందిన అరుణోదయ నాగన్న(పరకాల నాగయ్య)ను ఈ ఏడాదికి గాను సుద్దాల హనుమంతు–జానకమ్మ జాతీయ పురస్కారం వరించింది. నాగన్న స్వగ్రామం తిరుమలాయపాలెం మండలం రాజారం. అమరుడు శ్రీపాద శ్రీహరిది సైతం అదే గ్రామం కాగా, ఆయన స్ఫూర్తితో విప్లవోద్యమంలో చురుకైన కార్యకర్తగా, ప్రజా గాయకుడిగా నాగన్న ప్రస్థానం ప్రారంభమైంది. 1976లో సీపీఐ (ఎంఎల్) పార్టీలో చేరి నాటి నుంచి తన జీవితాన్ని ప్రజల కోసమే అంకితం చేశారు. తన జీవిత భాగస్వామి లక్ష్మితో కలిసి అరుణోదయ సాంస్కృతిక విప్లవోద్యమంలో భాగస్వాములయ్యారు.

జిల్లా ముద్దుబిడ్డగా..

జిల్లా బిడ్డ అయిన నాగన్న కొన్ని దశాబ్దాలుగా సాంస్కృతిక విప్లవోద్యమంలో అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఆయన సతీమణి లక్ష్మి, వారి ఏకైక కుమారుడు అజయ్ కూడా సాంస్కృతిక విప్లవోద్యమంలో పనిచేస్తున్నారు. నాగన్న జీవితాన్ని అధ్యయనం చేసిన సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. తమ తల్లిదండ్రుల పేరిట ఏటా ప్రముఖులకు ఇచ్చే ఈ అవార్డును ఈ ఏడాది నాగన్నకు అందజేయనున్నారు. ఇప్పటివరకు గద్దర్, గోరేటి వెంకన్న, ఆర్.నారాయణమూర్తి, జయరాజు, అందెశ్రీ, విమలక్క లాంటి 12 మంది ప్రముఖులు ఈ అవార్డుకు ఎంపిక అయ్యారు.

నాగన్న ఇంటికి వచ్చి ఆహ్వానం..

జాతీయ పురస్కారానికి నాగన్న ఎంపిక కావడంతో సుద్దాల అశోక్‌తేజ ఖమ్మంలోని నాగన్న ఇంటికి వచ్చి ఆహ్వానం పలికారు. హైదరాబాద్‌లోని సుందరయ్య కళా నిలయంలో శనివారం పురస్కారం అందజేస్తామని, స్వీకరించాలని కోరారు.

ర్యాగింగ్‌ను రూపుమాపాలి

సీపీ సునీల్‌దత్



సునీల్‌దత్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

ఖమ్మంవైద్యవిభాగం : ర్యాగింగ్ అనేది పెనుభూతమని, దాన్ని రూపుమాపేందుకు విద్యార్థులు పాటుపడాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. శుక్రవారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ విద్యార్థులు జూనియర్లపై ర్యాగింగ్ చేయటం చట్ట ప్రకారం నేరమని, అలాంటి వారిని కఠినంగా శిక్షిస్తామని అన్నారు. ఇలాంటి ఆచారాలు రూపుమాపేందుకు ప్రతీ విద్యార్థి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు కెరియర్‌పై దృష్టి పెట్టి ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఆర్‌ఎంఓ రాథోడ్ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

21న జిల్లాకు ఏఐఎస్, సీసీఎస్ అధికారులు

క్షేత్రస్థాయిలో పర్యటించనున్న యంత్రాంగం

ఖమ్మం సహకారనగర్ : ఆలిండియా సర్వీసెస్(ఏఐఎస్), సెంట్రల్ సివిల్ సర్వీసెస్(సీసీఎస్)కు చెందిన 21 మంది అధికారులు ఈనెల 21న జిల్లాకు రానున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును తెలుసుకుంటారు. జిల్లాకు వచ్చే వారిలో ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్, పోస్టల్ సర్వీస్, రైల్వేస్ తదితర కేడర్లకు చెందిన అధికారులు ఉండగా వారిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. వీరికి నోడల్ అధికారిగా జెడ్పీ సీఈఓ దీక్షారైనా వ్యవహరిస్తారు. ఈ నెల 21 నుంచి 25 వరకు ఒక్కో బృందం జిల్లాలోని ఒక్కో గ్రామాన్ని పరిశీలిస్తుంది. 25 నుంచి 28వ తేదీ వరకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వైరా, మధిర మున్సిపాలిటీల్లో ఈ బృందం పరిశీలన చేయనుంది.

సీఎంను కలిసిన వైరా ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌తో ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ శుక్రవారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గ సమస్యలను వివరించి, సింగరేణి మండలానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరగా, సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

విద్యార్థుల జీవితాల్లో మార్పు తేవాలి

- ప్రభుత్వ విద్యా వ్యవస్థ పూర్వ వైభవం సాధించేలా పని చేయండి
- నూతన ఉపాధ్యాయులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్ : ‘రానున్న 30 సంవత్సరాల జీవితంలో భవనాలు కట్టడం.. పెద్ద వాహనాలు కొనడం, పదోన్నతులు సాధించడమే విజయాలు కావు.. మనం ఎంత మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేశామనేదే కీలకం.. అమ్మాయి చదివితే తరతరాలుగా కుటుంబాలు బాగుపడతాయి. నేను చిన్నతనంలో ఏడో తరగతి వరకు బ్యాక్ బెంచ్ స్టూడెంట్‌గా ఉండేవాడిని. నాడు విజయలక్ష్మి టీచర్ పెట్టిన శ్రద్ధతోనే నేడు ఈ స్థాయిలో ఉన్నా’ అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన ఉపాధ్యాయులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రైవేట్ విద్యకు తావు లేదని, గ్రామాల్లో ఉపాధ్యాయుడు అంటే దేవుడితో సమానంగా చూశారని, ఏ సమస్య ఉన్నా ఉపాధ్యాయులే పరిష్కరించేందుకు ప్రయత్నం చేసేవారని తెలిపారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలను విజయవంతంగా రాసి ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరినీ అభినందించారు. డీఈఓ సోమశేఖర శర్మ మాట్లాడుతూ.. జిల్లాలో 516 మంది నూతన ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా, వారిలో 481 మంది విధుల్లో చేరారని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓ రాజశేఖర్, ఏఎంఓ రవి తదితరులు పాల్గొన్నారు.

‘గ్రూప్స్’ పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు

జిల్లాలో గ్రూప్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. టీజీపీఎస్సీ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పరీక్షల నిర్వహణకు 87 కేంద్రాలు ఉండగా 68 కేంద్రాలను తనిఖీ చేశామని చెప్పారు. ఆ తర్వాత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. వచ్చే నెల 17, 18 తేదీల్లో గ్రూప్–3 పరీక్షలు ఉన్నాయని, జిల్లాలో 28,468 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వివరించారు. నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఏఎస్పీ నరేష్‌కుమార్, డీఆర్‌ఓ రాజేశ్వరి, ఏసీపీ రమణమూర్తి, ఏటీఓ విజయ్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ అరుణ పాల్గొన్నారు.

నిజాయితీగా ఉంటేనే జిల్లాలో పని చేయండి

నిజాయితీగా పని చేస్తేనే జిల్లాలో ఉండాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మీ సేవా, ధరణి, మ్యూటేషన్ తదితర పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని, ప్రజల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దని పలుమార్లు చెప్పినా తీరు మారడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో తహసీల్దార్లు అలసత్వం వహిస్తున్నారని, ఇదే ధోరణి కొనసాగితే జిల్లాలో పని చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మినహా మిగిలిన తహసీల్దార్లు.. వరదలతో సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి జారీ చేయడంలో ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిసిందని, ఏరోజు పని ఆరోజే పూర్తి చేయాలని ఆదేశించారు.

మీ తోడుగా నేనుంటా

ఖమ్మంవన్‌టౌన్: తమకు ఎవరూ లేరనే భావనను మనసు నుంచి తీసేసి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. నగరంలోని బాలల సదనాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సత్తుపల్లి సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న కె.కావ్యకు ల్యాప్‌టాప్ అందించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏకాగ్రతతో చదివి లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలన్నారు. బాలల సదనంలోని పిల్లలంతా ఉన్నత స్థాయికి చేరేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ప్రాంగణంలోని ఖాళీ ప్రదేశాన్ని చదును చేసి పిల్లలకు జారుడు బండ, బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పిల్లలను జనవరి లోపు చారిత్రక ప్రదేశాలు, విజ్ఞాన, పరిశోధక ప్రాంతాలు, ఆహ్లాదకర విహారయాత్రలకు తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆయన వెంట జిల్లా సంక్షేమాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా శిశు సంరక్షణ అధికారిణి విష్ణువందన తదితరులు ఉన్నారు.

కుటుంబం ఎలా గడుస్తోంది..

అన్నాచెల్లెళ్లను ఆరా తీసిన కలెక్టర్



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బాలసదనం ఎదుట ల్యాండ్రీ షాపు నిర్వహిస్తున్న అన్నా చెల్లెళ్లు ఎస్.ఉపేందర్, ఆర్.సంధ్యను శుక్రవారం ఆయన పలకరించారు. రోజు ఎంత ఆదాయం వస్తోంది, కుటుంబ పోషణ ఎలా ఉంది వంటి వివరాలపై ఆరా తీశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణం పొంది షాప్‌లో వసతులు పెంచుకోవాలని సూచించారు. – ఖమ్మం సహకారనగర్

అంతర్జాతీయస్థాయికి ఎదగాలి



విలువిద్య పోటీలను ప్రారంభిస్తున్న భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

- ప్రతిభ చూపిన విద్యార్థుల పాఠశాలల అభివృద్ధికి రూ.50 వేలు
- గిరిజన పాఠశాలల జోనల్ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఐటీడీఏ పీఓ రాహుల్

పాల్వంచరూరల్: గిరిజన పాఠశాలల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జోనల్‌స్థాయి గిరిజన పాఠశాలల క్రీడాపోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడా బంధాన్ని స్వీకరించి క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ జోనల్‌స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల పాఠశాలలకు ప్రోత్సాహకరంగా రూ.50 వేలు కేటాయిస్తామన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యానికి, మనో వికాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. బాలబాలికలు ఇష్టమైన క్రీడపై దృష్టి సారించి నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. గిరిజన విద్యాసంస్థలోని విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని వెలికి తీసేందుకు ప్రతి ఆదివారం వినూత్న కార్యక్రమాలు చేపడతామన్నారు. మొదటి రోజు బాలికల విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, చదరంగం, ఆర్చరీ, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహించారు. శనివారం బాలుర విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 70 పాఠశాలల నుంచి సుమారు 800 మంది బాలబాలికలు క్రీడా పోటీలకు తరలివచ్చారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ.మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు జహీరుద్దీన్, అశోక్‌కుమార్, రాధమ్మ, చంద్రమోహన్, స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాల్‌రావు, కిన్నెరసాని స్కూల్ హెచ్‌ఎం.రామారావు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్ విజేత ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్



విజేతగా నిలిచిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి డిగ్రీ కళాశాలల క్రికెట్ టోర్నీ విజేతగా ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల జట్టు నిలిచింది. రెండో స్థానాన్ని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల జట్టు కైవసం చేసుకుంది. బహుమతి ప్రదానోత్సవంలో కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణారావు, కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.వెంకన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి జె.ఉపేందర్, పీడీలు డాక్టర్ పి.రఘునందన్, గోపీకృష్ణ, విల్సన్, శ్రీనివాస్, ఆర్.ఉపేందర్, కమల్, సతీశ్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

బాలికలు కష్టపడి చదవాలి



బాలికలతో మాట్లాడుతున్న జీసీడీఓ తులసి

ఎర్రుపాలెం: బాలికలు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లోకి చేరుకోవాలని బాలికల అభివృద్ధి అధికారి తులసి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యాబోధనలో మరింత నాణ్యత ఉండాలని ప్రిన్సిపాల్ కె.సరిత, ఉపాధ్యాయులకు సూచించారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, సిబ్బంది పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని తెలిపారు.

నేడు ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభ సీఏఏ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.భాస్కర్, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, రవిమారుత్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయిబాబాపై విచారణ ముగిసింది.. సమాజంపై సాయిబాబా విచారణ మొదలైందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం పెట్టిన కుట్ర కేసులో పదేళ్లకు పైగా కఠినమైన జైలు జీవితం గడిపి, నిర్దోషిగా విడుదలై అకాల మరణం చెందారని, సభను విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



శివకుమార్ (ఫైల్)

కొణిజర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మండలంలోని తనికెళ్లకు చెందిన చల్లా శివకుమార్ (35) ఈ నెల 15న ద్విచక్రవాహనంపై వైరా వెళ్తూ కొణిజర్ల ఎస్ఎస్‌పీ కాల్వ సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయ కావడంతో హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య యశోద, కూతురు ప్రియదర్శిని, కుమారుడు ఉదయ్‌కార్తీక్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూరజ్ కేసు నమోదు చేశారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన రాయల రాంబాబుపై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వేల్పుల గోపయ్య ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన రాంబాబు అసభ్య పదజాలంతో దూషిస్తూ చంపుతానని బెదిరించాడు. గోపయ్య భార్య సామ్రాజ్యంను అసభ్య పదజాలంతో దూషించాడు. సామ్రాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,225	5,100
మిర్చి	16,400	9,500
మిర్చి తాలు	9,000	9,000
ఏసీ మిర్చి	19,000	10,400
ఏసీ తాలు	9,500	9,300
కొత్త పత్తి	7,000	5,500
పాత పత్తి	7,300	7,100

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.17,043

అందని పౌష్టికాహారం



వసతి గృహాలు, గురుకుల విద్యార్థులకు పెరగని డైట్ చార్జీలు

- 2017 నాటి చార్జీలతోనే మెనూ అమలు
- పెరిగిన ధరలతో ఆహార పదార్థాలు అంతంతే..
- విద్యార్థులకు అందించే భోజనంలో లోపిస్తున్న నాణ్యత

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక వర్గాల విద్యార్థులతో పాటు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థుల కోసం ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలను ఏర్పాటు చేసింది. ఇంటి వద్ద తల్లిదండ్రులకు భారం కాకుండా కన్నవారిని, పుట్టిన ఊరిని వదిలి దూర ప్రాంతాల్లో ఉన్న సంక్షేమ వసతిగృహాల్లో, గురుకులాల్లో ఉంటూ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం వారికి మూడు పూటలా ఆహారం అందించడంతో పాటు వసతిగృహాల్లో ఉండేందుకు అవసరమైన సామగ్రిని సమకూరుస్తోంది. అయితే ప్రభుత్వాలు పేద పిల్లల పట్ల చిన్నచూపు చూస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాల తీరుతో విద్యార్థులకు చాలిచాలని, నాణ్యత లేని ఆహారం అందుతోందనే విమర్శలు ఉన్నాయి. 2017 ధరల ప్రకారం నాడు నిర్ణయించిన డైట్ చార్జీలే ఇప్పటికీ అమలు అవుతున్నాయి. పెరిగిన ధరలకు, విద్యార్థులకు ఇస్తున్న డైట్ చార్జీల్లో భారీ వ్యత్యాసం ఉండటంతో వారికి అందించే మెనూలో భారీగా కోత పడుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో 10 వేల మందికి పైగా ఉండి విద్యనభ్యసిస్తుండగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 35 వేల మందికి పైగా విద్యార్థులు ఉండి విద్యనభ్యసిస్తున్నారు.

మెనూ ఇలా..

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో, గురుకులాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తుంటారు. వసతిగృహాల్లో పాఠశాల ఉన్న రోజుల్లో మధ్యాహ్న భోజనం అక్కడే వడ్డిస్తుంటారు. సెలవు రోజుల్లో మాత్రం మూడు పూటలా భోజనం వసతిగృహాల్లోనే పెడుతుంటారు. రోజూ ఉదయం రాగి జావ, పాలు, తర్వాత అల్పాహారం అందిస్తారు. ఇడ్లీ, గోధుమరవ్వ ఉప్మా, కిచిడి ఇస్తారు. సాయంత్రం కూరగాయలు, సాంబారు, పప్పు, రసంతో భోజనం పెడతారు. ఆదివారం చికెన్, అరటి పండు అందిస్తారు. వీటితో వారానికి మూడు గుడ్లు అందిస్తారు. గతంలో ప్రతి రోజూ గుడ్డుతో పాటు, సాయంత్రం వేళ స్నాక్స్, రోజూ పండు ఇచ్చే వారు. నిత్యావసరాల ధరలు పెరగడంతో ఇప్పుడు వాటిని నిలిపివేశారు. దీంతో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం సరిపడినంత అందడం లేదు.

అమలు కాని ప్రతిపాదనలు..

2017–18 ఏడాదిలో గత ప్రభుత్వం చివరిసారిగా మెస్ చార్జీలను తరగతుల వారీగా పెంచింది. ఈ ఏడేళ్ల కాలంలో నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయి. కొన్నింటి ధరలు దాదాపు రెండింతలయ్యాయి. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలంటే ఈ ధరలతో సరిపెట్టడం వార్డెన్లు, ప్రిన్సిపాళ్లకు కష్టంగా మారింది. సరుకులు సరఫరా చేసే గుత్తేదారులకు కొంతకాలంగా బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో వారు చేతులెత్తేస్తున్నారు. నాణ్యత లేకున్నా వారిచ్చే సరుకులు తీసుకోవాల్సి వస్తోంది. గత ప్రభుత్వం గతేడాది మార్చి మెస్ చార్జీలు పెంచేందుకు ప్రతిపాదనలు చేసింది. 2017–18 ఏడాదిలో తరగతులను బట్టి రూ.950 నుంచి రూ.1,500 వరకు డైట్ చార్జీలు ఉండగా.. వాటిని రూ.1,200 నుంచి రూ.1,875 వరకు పెంచుతూ ప్రతిపాదనలు చేసింది. అసెంబ్లీ సమావేశాల్లో ఈ ప్రతిపాదనలు ఉంచి, ఆమోదింపజేసింది. అయితే ఆ ప్రతిపాదనలు పేపర్లకే పరిమితమయ్యాయనే విమర్శలు ఉన్నాయి. ఇక కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు మెస్ చార్జీల పెంపు ఊసెత్తడం లేదని, విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నేతలు విమర్శలు చేస్తున్నారు.

2017-18 ఏడాదిలో డైట్ చార్జీల ఆధారంగా నిర్ణయించిన కొన్ని వస్తువుల ధరలు, ప్రస్తుతం నిర్ణయించిన వాటి ధరల వివరాలు.. (కిలోల చొప్పున)

ఆహార పదార్థాలు	2017–18 నాటి ధరలు	2024–25 ధరలు
వంటనూనె	రూ.95	రూ.133
ఉప్పు	రూ.14	రూ.20
ఉల్లిగడ్డ	రూ.20	రూ.41
పసుపు	రూ.140	రూ.279
సాంబారుపొడి	రూ.390	రూ.550
కూరగాయలు	రూ.25	రూ.40
చికెన్	రూ.139	రూ.240
గుడ్లు	రూ.3.49	రూ.6
కందిపప్పు	రూ.65	రూ.180
కారం	రూ.140	రూ.340
మినపపప్పు	రూ.70	రూ.130
వెల్లుల్లి	రూ.70	రూ.160
అల్లం	రూ.90	రూ.150
పాలు	రూ.52	రూ.62
పచ్చి శనగపప్పు	రూ.55	రూ.125
పల్లీలు	రూ.80	రూ.125

అన్నింటిలో కోత..

సంక్షేమ వసతిగృహాల్లో, గురుకులాల్లో ఉంటున్న విద్యార్థులకు డైట్ చార్జీలు పెరగకపోవడంతో వారికి అందే భోజనంలో నాణ్యత లోపించడంతో పాటు వారికి అందాల్సిన ఆహారం సక్రమంగా అందడం లేదు. ఆరేళ్ల కిందట కొన్ని శాఖల గురుకులాల్లో, వసతిగృహాల్లో విద్యార్థులకు నెలకు రెండుసార్లు మేకపొట్టేలు మాంసం అందించేది. నాడు ఆ మాంసం ధరను ప్రభుత్వం కిలోకు రూ.650గా నిర్ణయించింది. ప్రస్తుతం ఆ ధర రూ.900 నుంచి రూ.1,000కి పెరగడంతో పలు సంక్షేమ వసతి గృహాల్లో ఆ మాంసం పెట్టడమే మానేశారు. చికెన్ మాత్రమే అందిస్తున్నారు. వారంలో ఆరు రోజులు ఒక పూట గుడ్డు, ఒకపూట అరటిపండు ఇవ్వాల్సి ఉండగా.. పండును పూర్తిగా మానేసి గుడ్లు మాత్రం వారానికి మూడు మాత్రమే అందిస్తున్నారు. పలు వసతిగృహాల్లో ఉదయం పూట కూడా బియ్యంతో వండిన ఆహారాన్నే అల్పాహారంగా అందిస్తూ, ఇడ్లీ వంటి వాటిని బంద్ చేశారు. స్నాక్స్, టీ, పాలు వంటి వాటిల్లో కూడా కోత పడినట్లు తెలుస్తోంది.

ఫాసిస్ట్ భావజాలం ప్రమాదకరం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ముదిగొండ: బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్ట్ భావజాలం ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని అమ్మపేటలో శుక్రవారం జరిగిన మండల 9వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలపై రాజ్య హింసను ఎదుర్కొనే క్రమంలో హక్కుల కార్యకర్తలు హత్యలు నిర్బంధాలకు గురవుతున్నారని, ప్రొఫెసర్ సాయిబాబా మరణం సహజమైంది కాదని, అది ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. మతం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం ప్రజలను రెచ్చగొట్టడడం, విద్వేషాలను సృష్టించడం, పుట్టకతో వచ్చిన విద్య అని అధికార సుస్థిరం చేసుకునేందుకు మత రాజకీయాలనే లక్ష్యంగా పెట్టుకుని పాలిస్తోందని దుయ్యబట్టారు. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, మూసి నది ప్రక్షాళన పేరుతో మరో కొత్త రకం డ్రామా తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. కాగా, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌కే సైదులు పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేశ్, చింతలచెరువు కోటేశ్వరరావు, బండి పద్మ, వాసిరెడ్డి వరప్రసాద్, బట్టు పురుషోత్తం, వల్లభి రవికిరణ్, నంబూరి బాబు, ఇరుకు నాగేశ్వరరావు, టీఎస్ కల్యాణ్, వేల్పుల భద్రయ్య, రాయల శ్రీనివాసరావు, కోలేటి ఉపేందర్, కందిమళ్ల తిరుపతి, మందరపు వెంకయ్య, పద్మ, మరికంటి వెంకన్న, పంద్ర కోల రాంబాబు, చంతకాయల రామారావు పాల్గొ న్నారు. కాగా, సభలో సీపీఎం మండల కార్యదర్శిగా భట్టు పురుషోత్తంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పచ్చ దోమ ఉధృతిపై దృష్టిపెట్టాలి



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవికుమార్, శాస్త్రవేత్త ఫణిశ్రీ

వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు

కారేపల్లి: పత్తి పంటలో పచ్చ దోమ ఉధృతి అధికంగా ఉందని, ఎక్కువ వర్షపాతం, తక్కువ ఉష్ణోగ్రతలు, వాతావరణం మేఘావృతం కావడంతో పత్తి పంటలో పచ్చదోమ ఉధృతి అధికంగా ఉందని, రైతులు తక్షణమే సస్యరక్షణ చర్యలపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం వైరా ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు పీఎస్ఎం ఫణిశ్రీ తెలిపారు. శుక్రవారం మండలంలోని గేటురేలకాయలపల్లి గ్రామంలో పత్తి, మిరప పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు.

పత్తి పంటలో పచ్చదోమ

- పచ్చదోమ సాధారణంగా అధిక వర్షపాతం, వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉంటే వృద్ధి చెందుతుంది.
- పిల్ల, తల్లి పురుగులు, ఆకుల అడుగు భాగానికి చేరి రసాన్ని పీలుస్తాయి. దీంతో ఆకులు మొదట దోనెలుగా ముడుచుకొని, లేత పసుపు రంగులోకి మారి తరువాత ఆకుల అంచుల నుంచి ఎర్రబడి క్రమంగా ఎండిపోతాయి. దీంతో మొక్క ఎదుగుదల కుంటుపడిపోతుంది.
- సస్యరక్షణలో భాగంగా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా డైఫెన్ థయూరాన్ 1.25 గ్రా. లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.75 మి.లీ. లీటరు నీటికి కలిపి మందులను మారుస్తూ పిచికారీ చేయాలి.
- జీవ రసాయనాలైన 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె (1500 పీపీఎం) 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మిరప పంటలో పొగాకు లద్దెపురుగు

- పొగాకు లద్దెపురుగు లార్వాలు ఆకులకు చిన్న చిన్న రంధ్రాలు చేసి ఆకులను జల్లెడగా మారుస్తాయి.
- కాపు దశలో మిరప కాయలను ఆశించి ముచ్చిక వద్ద రంధ్రం చేసి శరీర భాగమంత కాయలోపలికి జొప్పించి గింజలను, గుజ్జును తింటాయి.
- పొగాగు లద్దె పురుగుకు ఎదిగిన లార్వాలను విషపు ఎరను ఉపయోగించి నివారించుకోవాలి. 5 కిలోల తవుడు, 500 మి.లీ. క్లోరిపైరిఫాస్, 500గ్రా. బెల్లం తగినంత నీటికి కలిపి చిన్న చిన్న గుళికలు తయారు చేసి పొలంలో సమానంగా చల్లాలి.
- ఎకరానికి 4 లింగకార్షక బుట్టలు అమర్చుకోవాలి
- నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లేదా నొవాల్యురాన్ 0.75 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సకార్బ్ 0.8 మి.లీ. లేదా ఇమమెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వైరా డివిజన్ ఏడీఏ టి.కరుణశ్రీ, మండల వ్యవసాయాధికారి బి.అశోక్‌కుమార్, ఏఈఓ బి.నరేశ్, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం..

సత్తుపల్లి డిపోలో ఒక్కరోజే రూ.33.58 లక్షలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపో రికార్డు స్థాయి ఆదాయం ఆర్జించింది. డిపో చరిత్రలోనే ఈ నెల 17న రికార్డు స్థాయిలో రూ.33,58,658 ఆదాయం వచ్చింది. రోజువారీగా సుమారు రూ.20 లక్షల ఆదాయం నమోదయ్యేది. కానీ దసరా పండుగ ముగిసిన తర్వాత ప్రయాణికులు తిరిగి వెళ్తుండడంతో ఒక్క రోజులోనే అత్యధిక ఈపీకే(కిలోమీటర్‌కు ఆదాయం) 69.68 శాతం, ఆక్యుపెన్సీ రేషియో 109శాతం సాధించింది. అత్యధికంగా 47,768 కిలోమీటర్ల మేర డిపో బస్సులు తిరగడం ద్వారా ఈ ఆదాయం లభించింది. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 1 నుంచి 16వ తేదీ వరకు షెడ్యూల్ బస్సులు కాకుండా అదనంగా 190 స్పెషల్ సర్వీస్‌లు నడపటం ద్వారా రూ.80,83,781 ఆదాయం లభించగా 101 శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించింది. కాగా, ఉద్యోగులు, కండక్టర్లు, డ్రైవర్ల సమష్టి కృషితోనే అత్యధిక ఆదాయం లభించిందని డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి అన్నారు. దసరా సందర్భంగా ఉద్యోగులు అంకిత భావంతో పని చేయడంతో పాటు ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించటంతో ఆర్టీసీ బస్సులకు ఆదరణ లభించిందని, డిపో చరిత్రలోనే అత్యధిక ఆదాయం సాధించటం ఆనందంగా ఉందన్నారు.

ఐటీఐలలో సీట్లు భర్తీ చేయండి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంసహకారనగర్: మారుతున్న కాలానుగుణంగా ప్రస్తుత ఉద్యోగ అవసరాల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా (అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు) తీర్చిదిద్దాలని రాష్ట్ర కార్మిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ కనుంచి జిల్లా కలెక్టర్లతో సీట్ల భర్తీపై సమీక్షించారు. ప్రస్తుత ప్రపంచంలో పోటీకి నిలబడి, ఉపాధి పొందాలంటే నైపుణ్యం ఎంతో అవసరమన్నారు. వీసీలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ.. జిల్లాలోని ఐటీఐల్లో 6 ట్రేడ్లకు సంబంధించి 172 సీట్లు ఉండగా, ఇప్పటికి 60 సీట్లు భర్తీ అయ్యాయని, మిగతా సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా కార్మిక సహాయ కమిషనర్ కృష్ణవేణి, సహాయ కార్మిక అధికారులు వెంగమ్మ, రమేశ్, చందర్, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెట్టినింటి ఎదుట కోడలు నిరసన



నిరసన తెలుపుతున్న జరీనా

ఖమ్మంక్రైం: తనకు సంబంధించిన నగదు, బంగారం, వెండి నగలు ఇంట్లో పెట్టుకొని అత్త, మామ ఇంటి నుంచి గెంటేశారని, తనకు న్యాయం చేయాలంటూ శుక్రవారం వివాహిత మెట్టినింటి ఎదుట నిరసనకు దిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. ముదిగొండ మండలానికి చెందిన జరీనాకు నగరంలోని త్రీటౌన్ ఎఫ్‌సీఐ గోదాముల ప్రాంతానికి చెందిన షేక్ షరీఫ్‌తో 2020లో వివాహమైంది. వారికి నాలుగేళ్ల పాప ఉంది. కొన్ని నెలల కిందట షరీఫ్ అనారోగ్యంతో మృతిచెందాడు. అత్తవారింటి వద్ద ఉన్న జరీనాను.. అత్త, మామలు గెంటేశారు. పుట్టింటివారు ఇచ్చిన రూ.10 లక్షల నగదు, 10 తులాల బంగారం, వెండి ఆభరణాలు, ఇంటి సామగ్రి వారి వద్దనే పెట్టుకొని తనను బయటకు పంపించారని, తనకు న్యాయం చేయాలని మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినా న్యాయం జరగలేదని బాధితురాలు వాపోయింది. త్రీటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సర్దిచెప్పారు. తన మామ సైదా, అత్త సఫియాబేగం, మరిది రంజాన్‌పాషాపై చర్యలు తీసుకోవాలని కోరింది.

రూ.2.44 కోట్లకు దంపతుల దివాలా పిటిషన్

బోనకల్: మండల కేంద్రానికి చెందిన హోటల్ నడుపుతున్న దంపతులు ఖమ్మంలోని ప్రిన్సి పల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.2.44 కోట్లకు దివాళా పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు 69 మంది ప్రతివాదులకు కోర్టు నుంచి నోటీసులు వచ్చాయి. మండల కేంద్రానికి చెందిన రామన నర్సింహారావు, సుధారాణి కొంతకాలంగా హోటల్ నడిపిస్తున్నారు. వ్యాపార నిర్వహణకు అధిక వడ్డీలకు పలువురి నుంచి రూ.2,44,20,375 నగదు అప్పు తీసుకున్నారు. అప్పులు తీర్చే పరిస్థితి లేక న్యాయవాదులు గంధం శ్రీనివాసరావు, డి.శిరీష ద్వారా ఐపీ దాఖలు చేశారు.

అపరిచితుల సంచారం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 16వ డివిజన్ శ్రీరాంనగర్ 13, 14 వీధుల్లో రెండు రోజుల కిందట ఆటోలో వచ్చిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సంచరిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అదే సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు పోలీస్ శాఖలో పనిచేసే ఓ వ్యక్తి వారిని ప్రశ్నించాడు. వారు ఏదో సమాచారం చెప్పి వెళ్లిపోయారు. అనుమానం వచ్చిన సదరు వ్యక్తి తిరిగి ఆ ప్రాంతానికి రాగా, వారు కూడా ఆ ప్రాంతంలోనే దాక్కున్నారు. ఈ దృశ్యాలన్నీ స్థానికంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

పెట్రోల్‌బంక్‌లో బాలకార్మికుడు



పెట్రోల్‌బంక్‌లో డీజిల్ కొడుతున్న బాలుడు

నేలకొండపల్లి: మండలంలోని ఓ పెట్రోల్‌బంక్‌లో బాలుడితో పనిచేయిస్తున్నారు. శుక్రవారం బంక్‌లో బాలుడు డీజిల్ కొడుతున్న దృశ్యాన్ని పలువురు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో బాలుడిని పనిలో పెట్టుకుని పనులు చేయిస్తున్న బంక్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

వేంసూరు: ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని మర్లపాడుకు చెందిన వృద్ధురాలు రామిశెట్టి రాములమ్మ ఒంటరిగా బీసీకాలనీలో ఉంటోంది. తన కుమారుడు, కుమార్తె జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి నోట్లో గుడ్డలు కుక్కి, చేతులు కట్టేసి మెడలోని బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. చేతి కట్లు తీసుకుని, కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలి ఇంటి ఎదుట ఉన్న హోటల్‌లో కొన్ని నెలలుగా కొందరు రాత్రిపూట మద్యం సేవిస్తున్నారని, వారే ఈ చోరీకి పాల్పడి ఉండొచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముదిగొండ: మండలంలోని వల్లభి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సువర్ణాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు. ఇసుక ట్రాక్టర్ల యజమాని, వల్లభిలో ఇసుక నిల్వ చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

బైక్ పల్టీ

కామేపల్లి: బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాగాయాలయ్యాయి. మండలంలోని పొన్నేకల్ గ్రామానికి కూరాకుల కోటేశ్వరరావు పని నిమిత్తం ఖమ్మం వెళ్లి తిరిగి బైక్‌పై పండితాపురం స్టేజీ వైపు వెళ్తున్నాడు. పండితాపురం సంత సమీపంలోని శ్రీనివాప ఫంక్షన్ హాల్ ఎదురుగా బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుడిపై ఇనుప రాడ్లతో దాడి

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామ పంచాయతీ జగదాంబగుంపులో రాఘబోయినగూడెం గ్రామానికి చెందిన నిట్ట సుదర్శన్‌పై నలుగురు యువకులు ఇనుపరాడ్లతో దాడికి దిగారు. పోలీసుల కథనం ప్రకారం.. రాఘబోయినగూడెం నుంచి ఖమ్మం వెళ్లేందుకు బైక్‌పై సుభాష్‌నగర్ కూడలి వద్దకు అర్ధరాత్రి వేళ సుదర్శన్ చేరుకున్నాడు. తన సోదరుడు రాజేశ్ ఇంటివద్ద బైక్ పెట్టేందుకు జగదాంబగుంపు వద్దకు వచ్చాడు. సుదర్శన్‌ను అనుసరించిన సుభాష్‌నగర్‌కు చెందిన వంశీ, ప్రేం, ఉదయ్, యాకూబ్ రాజేశ్ దుకాణం వద్ద ఘర్షణ పడ్డారు. నలుగురు వ్యక్తులు సుదర్శన్‌పై సీసాలు, ఇనుప రాడ్లతో దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన సుదర్శన్‌ను స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. సుదర్శన్ ఫిర్యాదు మేరకు వంశీ, ప్రేం, ఉదయ్, యాకూబ్‌తోపాటు ఆముదాల ప్రసాద్, గడ్డం అనిల్, మాలోత్ నాగేశ్వరరావుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.